సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 18 । అక్టోబర్ । 2022



సమస్యలకు సత్వర పరిష్కారం
- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే
- 100 అర్జీల స్వీకరణ

8లో



పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభం
- అందుబాటులో వ్యవసాయ సౌకర్యాలు
- జిల్లా వ్యవసాయాధికారి నందు

8లో



రీసర్వేతో రైతుల భూములకు భద్రత
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- ఆర్‌కే నగర్‌లో సర్వే ప్రారంభం

8లో

న్యూస్‌రీల్

ఆపరేషన్ పరివర్తన్‌లో కౌన్సెలింగ్



పోస్టర్లను చూపుతున్న పోలీసులు

కొయ్యూరు: మండలంలో సారా తయారు చేస్తున్న 150 మందికి సోమవారం ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలో 150 మంది సారా తయారీదారులను గుర్తించిన ఎస్‌ఐ రాజారావు వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరిపై బైండోవర్ చేయిస్తామన్నారు. సారా తయారీ, విక్రయిస్తూ పట్టుబడితే ఏడేళ్ల జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు.

వైఎస్సార్ సమగ్ర భూసర్వే పరిశీలన



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

వై.రామవరం: మండలంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని సోమవారం జాయింటు కలెక్టర్ జె.శివశ్రీనివాస్ పరిశీలించారు. దీనిలో భాగంగా ఆయన నక్కరాతిపాలెం, పైడిపుట్ట తదితర గ్రామాల్లో పర్యటించారు. అనంతరం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, తహసీల్దార్ కె.సుధాకర్, సర్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భూసమస్యలను ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. సర్వేను పారదర్శకతతో సక్రమంగా నిర్వహించాలని, తిరిగి ఏవిధమైన సమస్యలు తలెత్తకూడదని సర్వే అధికారులకు సిబ్బందికి సూచించారు. సర్వే విధానంపై సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ గడువు 19 వరకు పొడిగింపు

రంపచోడవరం: రేషన్ పంపిణీ గడువును ప్రభుత్వం పొడించినట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. బియ్యం తీసుకోని కార్డుదారులు ఈనెల 19 వరకు ఈ అవకాశాన్ని పొందవచ్చని ఆయన కోరారు. ఐసీడీఎస్, ఎండీఎం స్కీం ద్వారా ఇచ్చే సరకులకు కూడా ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్టు ఆయన పేర్కొన్నారు. ఎండీయూ వాహనదారులు ప్రభుత్వ ఆదేశాలు మేరకు పంపిణీ వేగవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లా సైన్స్ అధికారిగా నాగేశ్వరరావు



పెదబయలు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 ప్రధానోపాధ్యాయులు టి.నాగేశ్వరరావు జిల్లా సైన్స్ అధికారిగా నియమితులయ్యారు. జిల్లాస్థాయిలో సైన్స్ కార్యక్రమాలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన నియామకం పట్ల అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు చెండా బాలకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో మంచి భవిష్యత్తు




సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన యువతీ యువకులు

కొయ్యూరు: కంప్యూటర్ పరిజ్ఞానంతో మంచి భవిష్యత్తు సాధ్యమని సిఫా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎస్ శశిప్రభ అన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానంపై నెలరోజులపాటు శిక్షణ పొందిన 14 మందికి డౌనూరులో సోమవారం ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శశిప్రభ మాట్లాడుతూ వృత్తి పరమైన నైపుణ్యంతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చునన్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాస్ మాట్లాడుతూ గిరిజన యువతీ యువకులు స్వయం ఉపాధి పొందేందుకు లేదా కంపెనీల్లో చేరేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. సర్పంచ్ పొట్టిక భవాని మాట్లాడుతూ మహిళలు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనితీరే ప్రామాణికం

- 'ఉపాధి'కి గ్రేడింగ్
- ఏపీసీడీలుగా సిబ్బంది విభజన
- 'డి' గ్రేడ్ వారిపై క్రమశిక్షణ చర్యలు
- ఉత్తమంగా పనిచేస్తే అవార్డులు



ముంచంగిపుట్టులో ఉపాధి పనుల్లో నిమగ్నమైన వేతనదారులు

ముంచంగిపుట్టు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉపాధి హామీ పనితీరుకు గ్రేడింగ్ విధానం అమలు కానుంది. ఇది వరకు కూలీల హాజరు, పనుల కల్పన, మేట్లుగా స్త్రీలకు ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఇప్పుడు నూతనంగా అధికారుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించే దిశగా చర్యలు, ఉత్తమ పనితీరు కనబర్చిన వారికి అవార్డులతో సత్కరించే దిశగా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా గ్రేడింగ్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుచేయనుంది. డ్వామా పీడీ నుంచి కిందస్థాయి వీఆర్పీ వరకు పనితీరుకు అనుగుణంగా గ్రేడింగ్ ఇవ్వనుంది. జిల్లాలో 22 మండలాల్లో 2,74,110 జాబ్ కార్డుదారులుండగా, 5,95,709 మంది ఉపాధి పొందుతున్నారు. ఈ ఏడాది ఉపాధి కూలీలు 76,58,228 పని దినాలను ఉపయోగించుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో 183 మంది, క్షేత్రస్థాయిలో 353 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

గ్రేడింగ్‌కు పరిశీలించే అంశాలు
- పండ్ల తోటల అభివృద్ధి, అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ
- మొక్క ఎండిపోతే దాని స్థానంలో మరొకటి ఏర్పాటు
- ప్రతీ కూలీకి సగటు వేతనం తప్పనిసరి
- ప్రతీ కుటుంబానికి 100 రోజులు ఉపాధి పని
- జాబ్ కార్డులు అప్‌డేట్ చేయడం, ఏడు రకాల రికార్డుల నిర్వహణ
- పని ప్రదేశంలో బోర్డుల ఏర్పాటు, పని వారీగా రికార్డులు నిర్వహణ
- సామాజిక తనిఖీల రికవరీలు, మస్టర్ వెరిఫికేషన్‌లో పారదర్శకత
- వ్యవసాయ,అనుబంధ కార్యక్రమాల్లో 60 శాతం ప్రగతి

బాధ్యత పెంపొందించేలా..
- ఉపాధి హామీ పథకంలో అధికారులు, సిబ్బంది బాధ్యతను పెంపొందించేందుకు మార్కుల ఆధారంగా గ్రేడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల క్యాడర్ వారీగా పనితీరు,వివిధ అంశాల్లో సాధించిన ప్రగతికి వంద మార్కులు కేటాయించారు. వీటి ఆధారంగా ఎక్సలెంట్(ఏ గ్రేడ్)90పైన మార్కులు, గుడ్(బీ గ్రేడ్) 80 నుంచి 90 వరకు మార్కులు, ఫెయిర్(సీ గ్రేడ్)70 నుంచి 80 వరకు మార్కులు, తక్కువ(డీ గ్రేడ్)70 మార్కులుగా గుర్తిస్తారు.
- ఏ గ్రేడ్‌లో (ఎక్సలెంట్) ఉన్నవారికి జిల్లా,రాష్ట్ర స్థాయిలో అవార్డులను అందిస్తారు. బీ,సీ గ్రేడుల్లో ఉన్నవారికి పనుల కల్పనలో మరింతగా రాణించే విధంగా ప్రోత్సహిస్తారు.డీ గ్రేడ్‌లో వారికి పనితీరు మెరుగుకు రెండు నెలలు అవకాశం ఇస్తారు. అప్పటికి వారిలో మార్పు రాకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి.

బాధ్యత, జవాబుదారీతనం



ఉపాధి హామీ సిబ్బందికి మార్కుల ఆధారంగా గ్రేడింగ్ ఇస్తాం. సిబ్బంది పనితీరుకు అనుగుణంగా మార్కులు ఇస్తూ గ్రేడింగ్ విధానం పారదర్శకంగా నిర్వహిస్తాం. ఉపాధి హామీ పథకంలో ప్రతీ ఉపాధి కూలీకి పనులు కల్పించేందుకు, గ్రేడింగ్ ద్వారా సిబ్బంది పనితీరును అంచనా వేసేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. పీడీ స్థాయి అధికారి నుంచి వీఆర్పీ స్థాయి వరకు బాధ్యత, జవాబుదారీతనంగా ఉద్యోగ బాధ్యతలకు ఆస్కారం ఉంటుంది. పనితీరును బట్టి ప్రోత్సాహం లభిస్తుంది.

– రమేష్ రామన్, డ్వామా పీడీ

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- పెరుగుతున్న చలి తీవ్రత
- ఉదయం 8 గంటల వరకు దట్టంగా పొగమంచు



పాడేరులో చలిమంటను కాగుతున్న స్థానికులు



పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చలితీవ్రత పెరుగుతోంది. సోమవారం ఉదయం 8 గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో పొగమంచు కురిసింది. వాహన చోదకులు లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 21 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నెలకొంది. వ్యవసాయ పనులు, వారపు సంతలకు వెళ్లే గిరిజనులు పొగమంచుతో ఇబ్బందులు పడ్డారు. పాడేరు పట్టణంలో పలుచోట్ల వృద్ధులు చలిమంటలను ఆశ్రయించారు.ఉదయం కాస్త చలిగాలులు వ్యాపించాయి. పొగమంచు అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర

- 11 మండలాల రైతులతో కమిటీ
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- తోటల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు : కాఫీ, మిరియాల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గుర్రగరువు, మోదాపల్లి గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. కాఫీ రైతులతో మాట్లాడారు. కాఫీ తోటలు, అంతర పంట మిరియాల పాదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను తెలుసుకున్నారు. నాంది, మన్య తోరణం వంటి సంస్థలు కాఫీ పండ్లను కిలో రూ.45 నుంచి రూ.50ల ధరతో కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్‌కు గిరిజన రైతులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన రైతులంతా ఐక్యమత్యంగా ఉండి అధిక ధర వచ్చే సమయంలోనే అమ్మకాలు జరపాలని సూచించారు. దళారుల మోసాలకు గురికావొద్దని హితవు పలికారు. కాఫీ, మిరియాల గిట్టుబాటు ధరలకు సంబంధించి 11 మండలాల రైతులతో కమిటీని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కాఫీ ఏడీ అశోక్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, సబ్ అసిస్టెంట్ అప్పలనాయుడు, హార్టికల్చర్ అధికారులు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కుపాల్గొన్నారు.

పోలీసుశాఖకు రుణపడి ఉంటాం

ఉపాధి పొందిన యువతుల కృతజ్ఞతలు



ఉపాధి పొందిన గిరి యువతులతో సీఐ దేముడుబాబు, ఎస్ఐ రాము

అరకులోయ: పోలీస్‌శాఖ జీవితాంతం రుణపడి ఉంటామని గిరి యువతులు పేర్కొన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం ద్వారా గిరిజన నిరుద్యోగ యువతులకు ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతగిరి, అరకులోయకు చెందిన 18 మంది గిరి యువతులకు అచ్యుతాపురం టాటా కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఎస్పీ సతీష్‌కుమార్, అరకు సీఐ దేముడుబాబు, అనంతగిరి ఎస్ఐ కరక రాముకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యం



విద్యార్థినుల కొవ్వొత్తుల ప్రదర్శన

హెచ్‌ఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ టి.కృష్ణారావు

హుకుంపేట: బాల్యవివాహ రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని హెచ్‌ఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ టి.కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కస్తూర్బా విద్యార్థినిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో పార సంస్థ ఆద్వార్యంలో విద్యార్థులతో కలిసి బాల్య వివాహ వ్యతిరేఖ ఉద్యమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఉప సర్పంచ్ గోవింద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కస్తూర్బా విద్యార్థినుల ర్యాలీ

గిరి రైతుకు వెన్నుదన్నుగా..

- జిల్లాలో రూ.68.71 కోట్ల మేర రైతు భరోసా జమ
- 1.63 లక్షల మందికి లబ్ధి
- 85 శాతం మేర ఈక్రాప్ నమోదు
- కలెక్టర్ సుమిత్‌కుమార్



హాజరైన అధికారులు, రైతులు



రైతు భరోసా చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధితో పాటు రైతుల ఆర్థిక ప్రగతికి వెన్నుదన్నుగా నిలుస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. రెండవ విడత వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథక సాయం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కాఫీహౌస్‌లో నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిపూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి నంద్యాల జిల్లా ఆళ్లగెడ్డ నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించిన సాయం పంపిణీ కార్యక్రమాన్ని రైతులు, అధికారులతో కలిసి వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.63 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రూ.68.71 కోట్ల రైతు భరోసా నగదు జమ చేసిందన్నారు. ఏజెన్సీలో వ్యవసాయ, అటవీ భూములకు కూడా ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేస్తోందని వివరించారు. 2019 నుంచి ఇప్పటి వరకు 69 వేల ఎకరాల అటవీ భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ చేసామని తెలిపారు. మరో 6వేల ఎకరాలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చెక్‌డ్యాం నిర్మాణాలు, పాత వాటికి మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఈ ఏడాది 5వేల మెట్రిక్ టన్నుల కాఫీ సేకరణ లక్ష్యంగా నిర్దేశించామన్నారు. గిరి రైతుల భూములను గిరి భూమి పోర్టల్‌లో నమోదు చేసుకుంటే ప్రభుత్వ పథకాలన్ని మంజూరవుతాయన్నారు. జిల్లాలో మూడు లక్షల మంది రైతులకు సంబంధించి 2.60 లక్షల ఎకరాల భూములకు 85 శాతం మేర ఈక్రాప్ నమోదు చేశామని కలెక్టర్ వివరించారు.

పోడు భూములకు పట్టాల పంపిణీతో మేలు: అరకు ఎంపీ మాధవి

సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆర్వోఎఫ్ఆర్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, పోడు భూములకు పట్టాల పంపిణీతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు.

రైతు భరోసాను ఆర్వోఎఫ్ఆర్ భూములకు కూడా అమలు చేయడాన్ని ఆయా రైతులంతా ఈ నగదు ప్రోత్సాహకాన్ని వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. రైతుల ఉత్పత్తులన్నింటికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో ఉందని ఎంపీ పేర్కొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంతో పాటు అనుబంధ విభాగాలన్నింటిని అభివృద్ధి చేస్తూ గిరిజన రైతులకు అన్ని విధాల చేయూతనిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రాన్ని నిర్మిస్తున్నారని, ఆర్‌బీకే కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై సకాలంలో పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. గిరి రైతులంతా చిరుధాన్యాలు సాగు చేస్తున్నారని, ఆయా పంటలకు కూడా గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షురాలు ఎం.సరస్వతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నందు, తహసీల్దార్ వి.త్రినాథరావు నాయుడు, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ సన్యాసి, సర్పంచుల ఫోరం ప్రతినిధులు సీదరి రాంబాబు, వంతాల రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, లకే పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు కె.నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీ ఎస్‌వీ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు జి.లక్ష్మికొండమ్మ, కోడా సుశీల, ఊర్వశి, రామ సత్యవతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దారికాసిన మృత్యువు

- అతివేగంగా వస్తూ వ్యాన్‌ను ఢీకొన్న బైక్
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం
- సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మలుపు వద్ద ఘటన







మృతదేహాలను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న స్థానికులు (ఇన్‌సెట్) మృతులు



సీతపల్లి మలుపు వద్ద సంఘటన స్థలంలో మృతదేహాలు

రంపచోడవరం: విహారానికి వచ్చిన ఇద్దరు యువకులను మృత్యువు దారికాసి రోడ్డు ప్రమాదరూపంలో కబళించింది. ఆయా కుటుంబాలకు కడుపుకోత మిగిల్చింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో యువకుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. బైక్‌పై వస్తున్న యువకులు అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు చెబుతున్నారు. రంపచోడవరానికి పది కిలోమీటర్ల దూరంలో సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఆర్‌అండ్‌బీ మలుపు వద్ద సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరుకు చెందిన శివ (20), కాట్రావులపల్లికి చెందిన హరీష్ (21), జగ్గంపేటకు చెందిన మరో యువకుడు కాజులూరి దుర్గాప్రసాద్ సరదాగా గడిపేందుకు సోమవారం ఉదయం మారేడుమిల్లి వెళ్లారు. కాసేపు గడిపిన తరువాత అక్కడి నుంచి సీతపల్లి బ్రిడ్జి వద్దకు వచ్చారు. వాగులో దిగి స్నానాలు చేశారు. అనంతరం ముగ్గురు మోటార్ బైక్‌పై ఇంటికి బయలుదేరారు. సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మలుపు వద్దకు వచ్చేసరికి గోకవరం వైపు నుంచి వస్తున్న ఒడిశాకు చెందిన వ్యాన్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన శివ, హరిష్ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కాజులూరి దుర్గాప్రసాద్‌ను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడు. వాహనంలో ఉన్న వ్యాన్ యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బైక్ అదుపుతప్పి వ్యాన్‌ను ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగిందని రంపచోడవరం ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. మృతులు డిగ్రీ చదివినట్టుగా ఆయన వివరించారు.

తరచూ ప్రమాదాలు..: సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, అతివేగం ప్రమాదాలకు కారణమని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో సుమారు పది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వాహనాలు కూడా అదుపుతప్పి బోల్తా కొడుతున్నట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కేరింతలు కొడుతూ.. జలకాలాడుతూ..



పాడేరు - చింతపల్లి మార్గంలో కొత్తపల్లి జలపాతానికి సోమవారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. బండరాళ్ల పైనుంచి ధవళ వర్ణంతో ప్రవహించే నీటి ప్రవాహంలో కేరింతలు కొడుతూ జలకాలాడారు. జలపాతం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు సెల్ఫీలు, ఫొటోలు దిగారు. కబాబుల అమ్మకాలు జోరుగా సాగాయి. - జి. మాడుగుల

వెలుగు వీవోఏ ఉద్యోగుల నూతన కార్యవర్గం



భాను

పాడేరు రూరల్: ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం పాడేరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా భాను, ప్రధాన కార్యదర్శిగా ఎల్‌బీ రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా వి.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా సత్తిబాబు, ఉపాధ్యక్షులుగా జ్యోతి, దినేష్, మల్లేష్, సహాయ కార్యదర్శులుగా వరలక్ష్మి, శ్రీదేవి, రంజిత, మహేష్‌తోపాటు మరో 15 మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరావు, జిల్లా సహాయ కార్యదర్శి సుందరరావు, వెలుగు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి రూప తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించి మందులు విక్రయిస్తే చర్యలు


మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి

రాజవొమ్మంగి: మందుల దుకాణాల్లో నిబంధనలు అతిక్రమించి మందులు, మత్తు మందులు విక్రయించినట్టు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని, లైసెన్స్ రద్దు చేస్తామని డ్రగ్ ఇనస్పెక్టర్ కళ్యాణి హెచ్చరించారు. ఆమె రాజవొమ్మంగిలోని మెడికల్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. గ్రామంలో ఆరు షాపుల్లో రెండు షాపులకు ఫార్మసిస్టులు లేనట్టు గుర్తించారు. మందుల దుకాణాల్లో తప్పనిసరిగా ఫార్మసిస్ట్ అందుబాటులో ఉండాలని దుకాణదారులను ఆదేశించారు. అనకాపల్లి డ్రగ్ ఇనస్పెక్టర్ ఎస్, యుగంధర్ ఉన్నారు. కాగా డ్రగ్ ఇనస్పెక్టర్స్ వస్తున్నారన్న సమాచారంతో గ్రామంలో మెడికల్ షాపులన్నీ గంటకు పైగా మూతపడ్డాయి.

సమస్యలకు సత్వర పరిష్కారం

ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే


గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీ మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల అర్జీలు, వ్యక్తిగత సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్పందనకు సుమారుగా 100 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. కొన్ని సమస్యలు పరిష్కారం కోసం ఆయా శాఖ అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. సత్యసాయి పథకంలో పని చేస్తున్న 59 మందికి 8 నెలలుగా జీతాలు రావడం లేదని, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. తాము మారేడుమిల్లి మండలం కుట్రవాడ ప్లాంట్ వద్ద పనిచేస్తున్నట్టు తెలిపారు. 20 నెలలు నుంచి ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లు కట్టడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన కొండమొదల గ్రామ నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం అర్జీలు అందజేశారు. చింతలపూడి గ్రామానికి చెందిన 200 మంది గిరిజన రైతులు రబ్బరు సాగుకు మొక్కలు ఇవ్వాలని కోరారు. పల్లాల లచ్చిరెడ్డిలు భూపతిపాలెం ప్రాజెక్టు ముంపునకు గురైన కొత్తపాకలు గిరిజనులు తమకు 60 ఎకరాల భూమిని మంజూరు చేయాలని కోరారు. ఈతపల్లి కాలువపై వంతెన నిర్మాణం చేయాలని పలువురు గ్రామస్తులు విన్నవించారు. తమ కుమార్తె కంటి ఆరేషన్ కోసం ఆర్థిక సాయం కోసం వరదరాజు, రజిత గతంలో కోరగా, దీనిపై పీవో స్పందించి ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు రూ.18 వేలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారు సోమవారం కలిసి తమ పాప కంటి చూపు బాగుందని పీవోకు కృతజ్ఞతలు తెలియజేసి, సంతోషం వ్యక్తం చేశారు. ఏపీవో సీహెచ్ శ్రీనివాస్‌రావు, ఏవో డీఎన్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు


పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతను పురస్కరించుకొని పోలీసుస్టేషన్ వద్ద సోమవారం సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం సమకూర్చారు. ఈ సందర్భంగా సుమారు 130 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకరమణ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం


అదృశ్యమైన అచ్యుత పాప

గూడెంకొత్తవీధి: మండలంలోని లక్కవరపుపేట పంచాయతీ కొడిసింగికి చెందిన కోడా అచ్యుత పాప అనే బాలిక అదృశ్యమైనట్టు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. ఈమె గూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోందని చెప్పారు. దసరా సెలవుల తరువాత ఈనెల 10 వ తేదీన పాఠశాలకు వచ్చి, 11న తిరిగి బయటకు వెళ్లిందన్నారు. అప్పటి నుంచి బాలిక ఆచూకీ తెలియక పోవడంతో తల్లి కుమారీ పలు ప్రాంతాల్లో గాలించినట్టు చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్టు తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు 8331098906, 9441301844 అనే ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

యువతి అదృశ్యం


నవిత(ఫైల్)

గూడెంకొత్తవీధి: రింతాడకు చెందిన సోమల నవిత(18) అనే యువతి అదృశ్యమైనట్టు ఎస్ఐ అప్పల సూరి సోమవారం తెలిపారు. గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఈనెల 11న బయటకు వెళ్లిన నవిత ఇప్పటికీ ఇంటికి చేరలేదని ఆయన చెప్పారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్టు చెప్పారు. సమాచారం తెలిసిన వారు 94409 04235 అనే నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల నిరసన

రాజవొమ్మంగి/పాడేరు రూరల్: రాజవొమ్మంగి, పాడేరులోని సచివాలయాల సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం దొంతమూరు సచివాలయ హార్టీకల్చర్ అసిస్టెంట్ సుభాష్ చంద్ర వర్మ ఒత్తిడి వల్ల ఆత్మహత్య చేసుకున్నారని వారు ఆరోపించారు. దీనిపై విచారణ చేయాలని కోరుతూ ఎంపీడీవో బాపన్నదొరకు వినతిపత్రం అందజేశారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.అల్లూరి జిల్లా వర్కింగ్ సంఘం ప్రతినిధులు కిషోర్, రాంబాబు, లోవప్రసాద్, శాంతి, భవానీ, శిరీషా తదితరలు పాల్గొన్నారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ఆధ్యక్షుడు నాని పాత్రుడు, రామకృష్ణ, సిబ్బంది రంజిత్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడికి తీవ్ర గాయాలు


గాయపడిన మోహన్‌రావు

ముంచంగిపుట్టు: సీతగుంట గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలో దోడిపుట్టు పంచాయతీ తలబిరడ గ్రామానికి చెందిన కిల్లో మోహన్‌రావు తన భార్యతో కలిసి బైక్‌పై పెదబయలు వారపు సంతకు సోమవారం వెళుతుండగా బైక్‌ను ఆటో ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు రహదారిపై పడిపోయారు. ఈ ప్రమాదంలో మోహన్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయనను పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాడేరులో చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలు కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


పోలీసుల వద్ద ఉన్న మనోజ్ సాక్షిత్, హర్షవర్థన్

నర్సీపట్నం: స్కూల్ నుంచి పరారైన ఇద్దరు విద్యార్థులను తుని రైల్వే పోలీసుల సహకారంతో స్థానిక పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణ సీఐ ఎన్.గణేష్ తెలిపిన వివరాలున్నాయి. నర్సీపట్నం, చెట్టుపల్లి గ్రామాలకు చెందిన సింహాద్రి మనోజ్ సాక్షిత్, బంటు హర్షవర్ధన్ నర్సీపట్నంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఈ నెల 15న స్కూల్‌కు వెళ్లిన వీరు తిరిగి ఇళ్లకు వెళ్లకుండా పరారైన విషయం తెలిసిందే. విద్యార్థుల తండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు ముమ్మరం చేశారు. పరారైన ఇద్దరు విద్యార్థుల ఫొటోలను పక్క జిల్లాలకు చెందిన పోలీసులకు పంపించి అప్రమత్తం చేశారు. సోమవారం తుని రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ఇద్దరు విద్యార్థులను రైల్వే స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ పట్టుకుని నర్సీపట్నం పోలీసులకు అప్పగించారు. సీఐ గణేష్ ఆ ఇద్దరు విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

రోలుగుంట: మండలంలోని నర్సీపట్నం –వడ్డాదిలో రూట్‌లో భోగాపురం వద్ద స్థానిక ఎస్ఐ బి.నాగకార్తీక్ సోమవారం ముగ్గురిని అరెస్టు చేసి, పదికిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆ సమయంలో ఒక వాహనంపై వచ్చిన ముగ్గురు వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకుని, వారి వద్ద ఉన్న మూటను తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. బైక్‌పై ప్రయాణిస్తున్న మండలంలోని కంచుగుమల గ్రామానికి చెందిన గుమ్మిడి సత్తిబాబు(49) తమిళనాడుకు చెందిన పి.బరిసూరజ్(35),పాండ్యని స్వామి(51)లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

అనకాపల్లికి చేరిన శ్రీనివాస కళ్యాణ రథం


శ్రీనివాస రథాన్ని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నూకాంబిక అమ్మవారి ఆలయానికి శ్రీనివాస కళ్యాణ రథం సోమవారం చేరుకుంది. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్టు టీటీడీ అధికారులు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయం నుంచి ఆలయ ఈవో బుద్ద మహాలక్ష్మీనగేష్ హారతులు పట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీవారి రథాన్ని దర్శించుకున్నారు.

రీసర్వేతో రైతుల భూములకు భద్రత


నక్కరాతిపాలెంలో రీసర్వేను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ తదితరులు


సీతారామపాడులో రీ సర్వే పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ బేబీరత్నం

అరకులోయ రూరల్: భూసర్వేతోనే రైతుల భూములకు భద్రత ఉంటుందని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో భూ సర్వేను ఆయన సోమవారం ప్రారంభించారు. రైతుల భూములకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం రీసర్వే చేపడుతోందన్నారు. భూముల వివరాలను డిజిటల్ రూపంలో రికార్డుల్లో నమోదు చేసి, భూహక్కు పత్రాలు అందజేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, ఎంపీటీసీ లలితకుమారి, సర్పంచ్ బొజ్జ తదితరులున్నారు.

గంగవరం: మోహనాపురం గ్రామ సచివాలయ పరిధిల సీతారామపాడు గ్రామంలో భూ రీసర్వే కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం సోమవారం ప్రారంభించారు. రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ శ్రీమన్నారాయణ, సర్వే డీఐవో దేవేంద్ర రైతులను కోరారు. సర్పంచ్ అక్కమ్మ, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులున్నారు.

వై.రామవరం: నక్కరాతిపాలెంలో తహసీల్దార్ కె.సుధాకర్ అధ్యక్షతన భూ రీసర్వే కార్యక్రమాన్ని ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు రమణమ్మ, నాయకులు భారతిబాబు, కనకరాజు, బాబి, అధికారులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సమస్యల పరిష్కారానికి కృషి


రాజవొమ్మంగి జీపు జాతలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు


అనంతగిరిలో జీపు జాతను జెండాను ఊపి ప్రారంభించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

రాజవొమ్మంగి: ఉపాధ్యాయులు, ఏజెన్సీ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలు తెసుసుకొనేందుకు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ విళ్ల వెంకటేశ్వరరావు తలపెట్టిన జీపు జాతా సోమవారం రాజవొమ్మంగి చేరుకొంది. జీపు జాత కార్యక్రమంలో విద్యాలయాల్లో నెలకొన్న ఇబ్బందులు, ఉపాధ్యాయుల సమస్యలు సేకరించి ఎస్టీ సెల్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని వెంకటేశ్వరరావు అన్నారు. డీఈవో సస్పెండ్ చేసిన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోనేలా చర్యలు తీసుకోవాలని పలువురు టీచర్లు ఆయనకు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ ప్రతినిధులు ప్రభాకరవర్మ, విల్సన్‌బాబు, రాజుబాబు, ఉదయ్, పైడిమల్లు, రమేష్‌బాబు తదితరులున్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో జీపుజాత కార్యక్రమాన్ని సోమవారం చిలకలగెడ్డ వద్ద యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ , ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ జెండా ఊపి ప్రారంభించారు. సాబ్జీ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. చిట్టిబాబు, దేముడు, రామకృష్ణ, పడాల్, మల్లేష్, రామచందర్, భాస్కరరావు పాల్గొన్నారు.

‘టీడీపీ హయాంలో పోలవరం నిర్వాసితులకు అన్యాయం’


ఎంపీపీ మురళీ

రంపచోడవరం: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు కోసం కనీసం పట్టించుకోలేదని దేవీపట్నం ఎంపీపీ కుంజం మురళీ చెప్పారు. వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలిచి కాసులు కోసం పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం మాట్లాడడం దారుణమన్నారు. ఈ మేరకు ఎంపీపీ మురళీ సోమవారం ‘సాక్షి’తో మాట్లాడారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పోలవరం నిర్వాసితుల సమస్యలను పలుమార్లు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఫలితంగా నిర్వాసితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌ఆర్ చెల్లించారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి గురించి రాజేశ్వరికి మాట్లాడే అర్హత లేదన్నారు. టీడీపీ పాలనలో ఒక్క కాలనీ అయినా పూర్తయిందా, ఒక్కరికైనా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించారా చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో కాఫర్ డ్యామ్ నిర్మించడం వలనే 44 గ్రామాలు ముంపు బారిన పడ్డారన్నారు. కాఫర్ డ్యామ్ కారణంగా ముంపులో ఉన్న దేవీపట్నం గ్రామం వచ్చినప్పుడు టీడీపీ నాయకుడు లోకేష్‌ను గ్రామస్తులు అడ్డగించి, మీ వల్లే వరదల్లో కష్టాలు పడుతున్నామని నిలదీయలేదానని గుర్తు చేశారు. ప్రాజెక్టు వలన నష్టపోయే ప్రతీ ఒక్కరికీ న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. పోడు భూములకు సైతం నష్ట పరిహారం ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యుద్ధప్రతిపాదికన కాలనీల నిర్మాణం జరిగిందన్నార.

పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభం

పాడేరు రూరల్ : ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలతో పాటు రైతులకు పంట సలహాలు, భూసార, విత్తన పరీక్ష సౌకర్యాలు, విత్తనాలు, పురుగుల మందులతో పాటు వ్యవసాయ పరికరాలన్నీ అందుబాటులో ఉంటాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి.ఎస్. నందు అన్నారు.సోమవారం దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 600 ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. పాడేరులో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి.ఎస్. నందు ప్రారంభించారు. రైతులు ఆయా కేంద్రాలు, కోరమాండల్ బృందం మద్దతుతో భూసార పరీక్ష, సాగు సూచనలు పొందవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో సూర్య కుమారి, మార్కెటింగ్ అధికారి హరికృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త రాము నాయుడు, శ్రీలక్ష్మి మోదమాంబ ఏజెన్సీస్ డీలర్ సిహెచ్.వి.వి.మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతిపై దర్యాప్తు ముమ్మరం


సురేష్ అనుమానాస్పద మృతిపై పోలీసు అధికారులతో చర్చిస్తున్న డీఎస్పీ సునీల్

రోలుగుంట: మండలంలోని పడాలపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి పెద్దాడ సురేష్ అనుమానాస్పద మృతిపై అనకాపల్లి డీఎస్పీ సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పడాలపాలెం సమీపంలో ఆదివారం పెద్దాడ సురేష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విధితమే. దీనిపై మృతుడు తండ్రి రాము స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సునీల్ ఆ రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం కూడా పరిశీలించాయి. అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్, కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్, అనకాపల్లి టౌన ఎస్ఐ దివాకర్, కొత్తకోట, రావికమతం ఎస్ఐ విభూషణరావు, ఉమామహేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ బి.నాగకార్తీక్ సోమవారం దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సునీల్ విలేకరులతో మాట్లాడుతూ తమసిబ్బంది అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. మృతుడి తల్లిదండ్రులను విచారించవలసి ఉందని ఆయన చెప్పారు. అనుమానితుల వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

- యాచకుడి మృతదేహానికి దహన సంస్కారాలు


యాచకుడి మృతదేహం

డుంబ్రిగుడ: ఓ యాచకుడి మృతదేహానికి పోలీసులు దహన సంస్కారాలు నిర్వహించి, మానవత్వం చాటుకున్నారు. మండలంలోని కించుమండ సంత బయలు షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో సోమవారం ఓ యాచకుడు మృతిచెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ సంతోష్ కుమార్, సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని, మానవతాదృక్పథంతో మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు.

క్లుప్తంగా

మెరుగైన బోధనకు ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా బోధించాలని హెచ్ఎం లక్ష్మణరావు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో 7 స్కూల్ కాంప్లెక్స్‌లకు చెందిన 72 మంది ఉపాధ్యాయులకు తెలుగు, గణితం సబ్జెక్టులపై మెరుగైన బోధనపై నాలుగు రోజులు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులను హెచ్ఎం లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తూ అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ముఖ్యంగా చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు బి. త్రినాథ్, కె.కామేష్, సతీష్, ఈశ్వరరావు, అనిల్, గౌరి, సురేష్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో నీలి బాలరాజు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

దూసరపాములో నేడు 'గడప గడపకు'

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము పంచాయతీలో సుబ్బంపాడు, యర్రంపాడు, దూసరపాము గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతున్నారని, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకట రమణమూర్తి

మారేడుమిల్లి: స్థానిక కేజీబీవీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలలను ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకట రమణమూర్తి సోమవారం సందర్శించారు. విద్యార్థులలో విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఆయా విద్యాలయాల్లో మెనూ అమలు, బోధన, నిర్వహణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించాలన్నారు.విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఎంపీపీ పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ అనూషాదేవి

చింతపల్లిరూరల్: లోతుగెడ్డకు చెందిన సరమండ నాగేంద్రబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ అనూషాదేవి మృతుడి కుటుంబాన్ని సోమవారం కలిసి పరామర్శించారు. ప్రభుత్వపరంగా రావలసిన రాయితీలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచ్ సునీల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత, ఎంపీటీసీ దారలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- పాడేరు, అరకు, రంపచోడవరం గ్రామాల్లో 'గడప గడపకు'
- ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మిలకు ఘన స్వాగతం



రామాపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పద్మాపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కొత్తవీధి గ్రామంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కొయ్యూరు: గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మూలపేట పంచాయతీ రామాపురం, కొండసంత గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని 115 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి గడప గడపకు శ్రీకారం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని, పరిష్కరించేందుకు ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేస్తున్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, భవానీ, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, పీఏసీఎస్ చైర్మన్ గజ్జయ్యదొర, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, ఎంపీడీవో మేరీరోజ్, ఎంఈవో బోడంనాయుడు, నాయకులు సత్యనారాయణ, రాజులమ్మ, సుధాకర్, నూకాలమ్మ, పోతురాజు,శేఖర్, తిరుపతి, రామ్మూర్తి, సురేష్ పట్నాయక్, చంటి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని పద్మాపురం పంచాయతీ పరిధిలోని బెడ్డగుడ, పద్మాపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని 370 గడపలను సందర్శించారు. ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో పార్టీలకతీతంగా, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. గిరిజన ప్రాంతాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను, డైరెక్టర్ పుష్ప, సర్పంచ్ సుస్మిత, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, మండల పార్టీ మహిళా విభాగ అధ్యక్షురాలు సుమిత్ర, కో–ఆప్షన్ సభ్యుడు రహ్మతుల్లా, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపిడీవో వెంకటేష్, నాయకులు సుంద్ర, యాసీన్, సాంబ, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

దేవీపట్నం: పేద సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఇందుకూరు పంచాయతీలోని ఎం.రావిలంక, కొత్తవీధి, చాపరాళ్లపల్లి, గొంద్రాతిమంద, లోతుపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా ఎం.రావిలంక గ్రామంలో గద్దెలమ్మ అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో 400 గడపలను సందర్శించారు. అడుగడుగున గ్రామస్తులకు ఎమ్మెల్యే ధనలక్ష్మికు ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలు సక్రమంగా, సకాలంలో అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. కొత్తవీధి గ్రామంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు బాబ్జి, సత్యనారాయణ, మురళీకృష్ణ,కన్నయ్య, పోశమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపునకు కృషి చేయాలి



బంగారుమెట్టలో ఓటర్ నమోదు దరఖాస్తులు ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ అన్నారు. బంగారుమెట్ట, దారెల, పెదగూడ, ఏనుగురాయి గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌లు, నేతలు తదితరులు గ్రామాల్లోని పట్టభద్ర అభ్యర్థులను కలిసి ఓటరు నమోదు దరఖాస్తులను అందజేశారు. డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు మల్లికార్జున్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు పార్టీ శ్రేణులంతా గ్రామస్థాయిలో కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. సర్పంచ్‌లు రత్న, బాబురావు, నరసింగరావు నీలకంఠం, ఎంపీటీసీ కొండమ్మ, నేతలు కొండలరావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోవాలి

జి.మాడుగుల: గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి మండలంలో ఉన్న పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార కె.అప్పలస్వామి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించిన ఫారాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఓటరు నమోదుకు డిగ్రీ తత్సమాన పట్టభద్రులు అర్హులన్నారు. 2019 అక్టోబర్30వ తేదీ నాటికి డిగ్రీ పూర్యయి ఉండాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకోసుకోవటానికి ఆధార్, డిగ్రీ సర్టిఫికేట్‌తో పాటు ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటో తీసుకురావాలని సూచించారు. ఓటరు నమోదు కావల్సిన వారు ఫారం–18 నింపి మండల తహసీల్దార్ కార్యాలయంలో మిగిలిన పత్రాలు జతపరచి అందించాలన్నారు.

నేడు పోస్టల్ మేళా

అడ్డతీగల: మండల కేంద్రంలోని రెండు గ్రామ సచివాలయాలతో పాటు ఎల్లవరం బ్రాంచి పోస్టాఫీస్ వద్ద మంగళవారం పోస్టల్ మేళా నిర్వహించనున్నట్టు అడ్డతీగల సబ్ పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. ఈ పోస్టల్ మేళాలో బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్(ఎన్‌పిసిఐ లింక్ చేయడం), ఆధార్‌కార్డుకి మొబైల్ నంబర్ అనుసంధానం, యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్, వాహన ఇన్స్యూరెన్స్ తదితర సేవలు అందిస్తారన్నారు. ఇందులో భాగంగా బ్యాంకు అకౌంట్ ఓపెనింగ్ అయితే ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్, రూ.210 నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆధార్ నంబర్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం కోసం మొబైల్ ఫోన్, రూ.50 నగదు తీసుకురావాలన్నారు. యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ నమోదుకు ఆధార్ కార్డు, రూ.399 నగదు వెంట తీసుకురావాలన్నారు. రూ.10 లక్షలు ఇన్స్యూరెన్స్ కవరేజ్ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సత్యనారాయణ కోరారు.

దివ్యాంగుల వివరాల నమోదు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేష్

గూడెంకొత్తవీధి: పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఉమామహేష్ సోమవారం సమావేశం నిర్వహించారు. దివ్యాంగుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆయన సూచించారు. సదరం సర్టిఫికెట్లతో పాటు ఆయుష్మాన్ భారత్ పత్రాలను అందజేసే బాధ్యత గ్రామ వలంటీర్లు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత సదరం క్యాంపు నిర్వహణ తేదీల ను ఖరారు చేస్తామన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

మెరుగైన విద్యను అందించాలి



మత్స్యలింగంను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పెదబయలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ వైద్య, విద్యా సంస్థల స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎంపీపీ వరహాలమ్మ, హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం తదితరులు సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విద్య అందించాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.కృష్ణవేణి మాట్లాడుతూ పాఠశాలలో వసతిగృహం లేదని, వాచ్‌మెన్‌ను కలిపించాలని కమిటీకి తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులు తదితరులు జెడ్పీటీసీ మత్స్యలింగంను ఘనంగా సత్కరించారు.

రైతులకు అండగా ప్రభుత్వం



చింతూరు సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి



మారేడుమిల్లిలో మాట్లాడుతున్న ఏవో వెంకటేశ్వర్లు



జీకే వీధిలోని కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కుమారి

చింతూరు: అన్నదాతకు అండగా నిలుస్తూ, రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళీ, ఎంపీపీ సవలం అమల అన్నారు. రెండో విడత రైతు భరోసా నగదు విడుదల సందర్భంగా స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పంటలకు మద్దతు ధర అందిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎంతో మేలు చేకూర్చిందని, దీంతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ ఫలాలు అందుతున్నాయన్నారు. వ్యవసాయాధికారి కృష్ణకాంత్ మాట్లాడుతూ రెండో విడతలో భాగంగా చింతూరు మండలంలోని 4,436 మంది రైతులకు రూ 1.25 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ముత్తమ్మ, సర్పంచ్‌లు కన్నారావు, అరుణకుమారి, పార్టీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: వైఎస్సార్ రైతు భరోసా రెండో విడతలో భాగంగా మండలంలోని రెండోవ విడతలో భాగంగా మండలంలోని 3826 మంది రైతులకు నగదు జమ అయినట్టు ఏవో కె.వెంకటేశ్వర్లు అన్నారు. సర్పంచ్ ప్రభాకర్, వ్యవసాయ సహాయకుడు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: స్థానిక ఆర్‌బీకేలో రెండో విడత రైతు భరోసా, పీఎం కిసాన్ నిధుల పథకం నగదు పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఏవో మధుసూదన్, ఎంపీటీసీలు, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఏఈ చలపతి

రాజవొమ్మంగి: పీఎంఏవై. గ్రామీణ్ 2021–22 సంవత్సరానికి గాను శాశ్వత గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని శాఖ ఏఈ ఎ.వి.వి. చలపతి కోరారు. సోమవారం ఆయన వాతంగి, లోదొడ్డి పంచాయతీలలో లబ్ధిదారుల అవగాహన సదస్సులు నిర్వహించారు. యూనిట్ కాస్ట్‌లో రూ. 5వేల నగదును ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు ముందుగానే అందజేస్తోందన్నారు. అలాగే గృహనిర్మాణం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న, టాయ్‌లెట్ నిర్మాణం, ఉపాధి పనిదినాలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌లు శుభలక్ష్మి, రామారావు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, మాజీ సర్పంచ్ జాన్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ అర్జున్, వెలుగు వీఓఏలు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి



సీహెచ్‌సీలో బారులు తీరిన రోగులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోజు రోజుకు రోగుల తాకిడి పెరుగుతోంది. వాతావరణంలో మార్పులతో జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వ్యాధుల బాధితులతో ఆరోగ్య కేంద్రాలు కిటకిటలాడతున్నాయి. సోమవారం ఒక్కరోజే స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓపి 156గా నమోదైంది. గ్రామాల్లో రోగులు సంఖ్య పెరుగుతుండడంతో కిలగాడ, లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది గ్రామాల్లో శిబిరాలు అధికంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో 8 మంది వైద్యులు ఉండాల్సింది కాగా ఇద్దరు వైద్యులే ఉన్నారని, ఒకరు డెంటల్ డాక్టర్ కావడం, మిగిలిన ఒక్క డాక్టర్ ఓపీని చూడడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. రోగుల సంఖ్య పెరుగుతుండడంతో తప్పనిసరి పరిస్థితిలో డెంటల్ డాక్టర్ సైతం ఓపీని చూడల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యుల నియమాకానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

అడ్డతీగల: వేటమామిడి శివారు రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం ఎదుట కొలువైన కదంభేశ్వరునికి సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో లింగాకారంలోని స్వామి వారికి రుద్రాక్షల మాలలను ధరింపచేసి పంచ ద్రవ్యాలు, ఫల, పుష్పాలతో అభిషేకం జరిపారు. రుద్రాభిషేకం సమయానికి గోమాత ఆ ప్రాంతానికి రావడంతో గోవుకు పసుపు, కుంకుమ అద్ది పూజలు చేశారు. రుద్రాభిషేకం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వలంటీర్లకు నియామకపత్రాలు



గ్రామవలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీవో

గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల ఎంపికైన గ్రామ వలంటీర్లకు నియామక పత్రాలను ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, ఎంపీడీవో శ్రీనివాసులు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా గ్రామ వలంటీర్లు పనిచేయాలన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

ముంచంగిపుట్టు: వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని మండల వినియోగదారుల సంక్షేమ సేవ సంఘం ఫుడ్ విజిలెన్స్ ప్రతినిధులు ప్రసన్నకుమార్, జ్యోతిలు అన్నారు. వినియోగదారుల సేవ సంఘం సమావేశం సోమవారం జరిగింది. వారు మాట్లాడుతూ వినియోగదారులు వస్తువుల కొనుగోలు చేసినట్టు ధర, గడవు తేదీ వంటివి గుర్తించాలని, తేడాలుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వినియోగదారుల హక్కులకు భంగం కలిగిస్తే వ్యాపారులపై న్యాయపరమైన చర్యలు తప్పవని వారు అన్నారు. మోహన్, నాగభూషణం, కేశవరావులు పాల్గొన్నారు.

కనీస వేతనం అందజేయాలి

చింతపల్లిరూరల్: మధ్యాహ్న భోజనం వంట కార్మికులకు కనీస వేతనం మంజూరు చేయాలని ఆ పథకం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి అన్నారు.

స్థానిక గిరిజన భవన్‌లో సోమవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

సీఐటీయూ నేతలు చిన్నయ్యపడాల్, బుజ్జిబాబు, కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ ఫీజులు తగ్గించాలి

అరకులోయరూరల్: డిగ్రీలో అడ్మిషన్ ఫీజులు తగ్గించాలని, గిరిజన సంఘం ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల వద్ద సోమవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గిరిజన సంఘం నాయకులు రామన్న, గాసి, తదితరులు మాట్లాడుతూ ఫీజులు పెంచడంతో నిరుపేద గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు దుర్కొంటున్నారని, యంత్రాంగం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా వృక్షాలు

గంగవరం : పాతగంగవరం గ్రామంలో పలు చోట్ల భారీ వృక్షాలు ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈదురుగాలుతో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆ వృక్షాలు పడి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఆ వృక్షాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పదోన్నతులు కల్పించాలి

అరకులోయ రూరల్: ఏపీ టూరిజం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ప్లకార్డులతో నిరసన చేశారు. ఏపీ టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులకు సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గంగరాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బీడీసీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సాయిరమణ

కూనవరం: బీడీసీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఎస్.సాయిరమణ అన్నారు. కాచవరంలో సోమవారం ఏర్పాటు చేసిన పుస్తక నిక్షిప్త కేంద్రం(బీడీసీ)ని సోమవారం ఆమె ప్రారంభించారు. విద్యార్థులు, యువత పుస్తక పఠనంపై ఆసక్తి చూపాలన్నారు. కూనవరం గ్రంథాలయ నిర్వాహకుడు గోవిందరాజులు మాట్లాడుతూ కూనవరం గ్రంథాలయం నుంచి పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు వార, మాస పత్రికలు చేరుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోటేశ్వరరావు, ప్రేమ్‌చందు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.